క్లుప్తంగా

కొత్త ఓటర్లను గుర్తించాలి



డిచ్‌పల్లి: బూత్ లెవల్ ఆఫీసర్లు తమ పరిధిలో ఇంటింటికి తిరిగి 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి వారు కొత్త ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ సూచించారు. శనివారం డిచ్‌పల్లి మండలపరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బీఎల్‌వోల విధులు, సర్వేలు, ఇతరత్ర ప్రభుత్వ కార్యక్రమాల గురించి ప్రొజెక్టర్ ద్వారా (పీపీటీ) ఆర్డీవో అవగాహన కల్పించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు నమోదు కోసం ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. ఓటరు నమోదు కార్యక్రమం ఆన్‌లైన్‌లో చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె సతీశ్‌రెడ్డి, డీటీ శ్రీకాంత్, ఎలక్షన్ డీటీ అశ్వక్ హైమద్, ఆర్‌ఐలు సంతోష్, ప్రభు, అసెంబ్లీ లెవర్ మాస్టర్ ట్రైనర్స్ మల్లికార్జున్, సాయికుమార్, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి గ్రామ పరిధిలోని గాంధీనగర్‌లో ఉన్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో శనివారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిచ్‌పల్లి సీఐ వినోద్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు జీవనాన్ని నాశనం చేస్తాయన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు, షీటీం, మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే జైలు శిక్ష పడుతుందన్నారు. కార్యక్రమంలో జక్రాన్‌పల్లి ఎస్సై మాలిక్ రహమాన్, పాఠశాల కరస్పాండెంట్ మానస గణేశ్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఈవోకు సన్మానం



నిజామాబాద్‌అర్బన్: రాష్ట్రంలో జిల్లా విద్యాశాఖ ట్రిపుల్ ఐటీలో ఎక్కువ సీట్లు సాధించినందుకు శనివారం తపస్ నాయకులు డీఈవోను సన్మానించారు. ప్రథమ స్థానంలో నిలవడం వల్ల జిల్లా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు భట్టుభద్రినాద్, రామకృష్ణరెడ్డి, సుదర్శన్, మధుసూదన్, రాజ్‌కుమార్, శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

లక్ష్యానికి మించి మొక్కలు నాటాలి



డిచ్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్ణయించిన లక్ష్యానికి మించి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఏపీవో ఈఎస్ మంజుల సూచించారు. శనివారం డిచ్‌పల్లి మండలం మేజర్ గ్రామ పంచాయతీలు ధర్మారం(బి), నడిపల్లి నర్సరీలను ఆమె సందర్శించారు. నర్సరీల్లో పెంచుతున్న వివిధ రకాల మొక్కలను పరిశీలించారు. వన మహోత్సవం ప్రారంభానికి కల్లా మొక్కలను సిద్ధం చేయాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. ధర్మారం(బి) నర్సరీలో 10వేలు, నడిపల్లి నర్సరీలో 20 వేలు మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. అలాగే జీపీల ద్వారా ఇంటింటికి ఆరు మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వసతిగృహ సమస్యలు పరిష్కరించండి



ధర్పల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాల బాలికల వసతి గృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జాగృతి విద్యార్థి విభాగం రూరల్ డివిజన్ కన్వీనర్ రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ శాంత, ఎంపీడీవో బాలకృష్ణలకు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. వసతి గృహంలోని డైనింగ్ హాల్లో కరెంటు సమస్య తీవ్రంగా ఉందన్నారు. సీసీ కెమెరాలు కూడా పని చేయడం లేదని అన్నారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు రాహుల్, రవికాంత్, ప్రేమ్ కుమార్, భానుప్రసాద్, శివ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

- అభినందించిన ఉపాధ్యాయులు, గ్రామస్తులు
- హర్షం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు


హర్షిత్ రాంరెడ్డి


మెండె శ్రీనిక


పోతుగంటి వైష్ణవి


మేడి అక్షయ్


అగ్గిడి భావన

డిచ్‌పల్లి: బాసర ట్రిపుల్ ఐటీకి నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎంపికయ్యారు. డిచ్‌పల్లి మండలంలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి పూర్తి చేసిన ఏడుగురు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి శనివారం తెలిపారు. కమలాపూర్ హైస్కూల్‌లో ఒకరు, మిట్టాపల్లి హైస్కూల్‌లో ఒకరు, రాంపూర్ హైస్కూల్‌లో ముగ్గురు, సుద్దులం హైస్కూల్‌లో ఒకరు, కొరట్‌పల్లి హైస్కూల్‌లో ఒకరు ఎంపికైనట్లు ఎంఈవో పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను ఆయా గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు. తమ పిల్లలు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సిరికొండలో..

సిరికొండ: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పదకొండు మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు. సిరికొండలోని పీఎంశ్రీ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రసన్నకుమార్, బిందువర్ధిని, నందిని, అర్షిత, అక్షయ, స్నేహ, నిత్యశ్రీ, తాళ్లరామడుగు జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన నక్క శశిర, కొండాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు అలేఖ్య, నందిని, విష్ణుప్రియలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు.


నక్క శశిర

జక్రాన్‌పల్లిలో..

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అఖిల్, విఘ్నేశ్ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈవో, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అభినందించారు.


అఖిల్


విఘ్నేశ్

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

సుభాష్‌నగర్: నగరంలోని మాలపల్లి ముజాయిద్‌నగర్‌కు చెందిన అభిబా కౌసర్ కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. మెరుగైన చికిత్స కోసం సీఎం సహాయనిధి నుంచి రూ.4 లక్షల ఎల్‌వోసీని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం, సంక్షేమమే తన మొదటి కర్తవ్యమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి పౌరునికి చేరవేయడమే తన లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులున్నా తనను సంప్రదించాలని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.


బాధితుడికి ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

హ్యాట్సాఫ్ పోలీసన్న

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ ప్రాంతంలో బైక్‌పై వస్తున్న ఓ వ్యక్తి లోబీపీతో కిందపడిపోయాడు. ఈ ఘటనలో అతనికి గాయాలయ్యాయి. విషయాన్ని గమనించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ సంజీవ్ వెంటనే అతడి వద్దకు వచ్చి ప్రథమ చికిత్స అందించి అంబులెన్స్‌లో ఆస్పత్రికి పంపేలా చర్యలు తీసుకున్నారు. ఇది చూసిన పలువురు స్థానికులు హ్యాట్సాఫ్ పోలీసన్న అంటు అభినందించారు. విషయం తెలుసుకున్న ఏసీపీ మస్తాన్ ఆలీ, ట్రాఫిక్ సీఐ ప్రసాద్ కానిస్టేబుల్‌ను అభినందించారు.


బీపీతో కిందపడిపోయిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న కానిస్టేబుల్ సంజీవ్

నర్సయ్య స్ఫూర్తితో ఉద్యమాలు నిర్మిద్దాం

నిజామాబాద్ రూరల్: నాయక్వాడి నర్సయ్య స్ఫూర్తితో ఐక్య ప్రజా ఉద్యమాలు నిర్మిద్దాం అని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పరుచూరి శ్రీధర్ అన్నారు. శనివారం నర్సయ్య సంస్మరణ సభను మండలంలోని కాలూరులో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలను దోపిడీ చేసి కార్పొరేట్ పెట్టుబడిదారులకు దేశ వనరులను ప్రభుత్వాలు కట్టబెడుతున్నారని, హక్కుల కోసం, దోపిడీ వ్యవస్థ మార్పు కోసం నర్సన్న పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూరు భూమయ్య, నీలం సాయిబాబా, దేశెట్టి సాయిరెడ్డి, కత్తుల సాయిలు, మల్లేశ్, సైదులు, సాయిలు, రమేశ్, సత్యం, శివకుమార్, మల్లికార్జున్, అన్వేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



దొడ్డి కొమురయ్య ఆశయాలు కొనసాగిస్తాం

మోపాల్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య ఆశయాలు కొనసాగిస్తామని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. శనివారం మోపాల్ మండలంలోని తాడెంలో దొడ్డి కొమురయ్య ట్రస్ట్ భవనంలో అఖిల భారత రైతు కూలీ సంఘం, రాష్ట్ర రైతు సంఘాల ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూమయ్య మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు, దేశ విముక్తి కోసం మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరిగిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పుతున్నాయని ఆరోపించారు. బడా బాబులకు రూ. లక్షల కోట్లు మాఫీ చేస్తున్న మోదీ ప్రభుత్వం.. రైతుల అప్పులను ఎందుకు మాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వాల ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలోభాగంగా గ్రామాల్లో సమ్మెకు మద్దతుగా రైతులు నిరసన తెలపాలని కోరారు. కార్యక్రమంలో రైతు, పౌరహక్కుల సంఘం, ఏఐకేపీ, పలు సంఘాల నాయకులు ఏ రాజేశ్వర్, సాయాగౌడ్, వాల్గోట్ రవీందర్, నాయకులు బండిమీది నర్సయ్య, వెంకటి, పరమేశ్, గంగారాం, సాయిరెడ్డి, నారాయణ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వేల్పూర్ భూమయ్య

కలెక్టర్‌ను కలిసిన బీసీటీయూ నాయకులు



నిజామాబాద్‌అర్బన్: బీసీటీయూ సంఘం నాయకులు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డిని శనివారం మర్యాద పూర్వకంగా కలిసి నోట్‌బుక్స్ అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మాడవేటి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. బీసీలకు క్రిమిలేయర్ సర్టిఫికెట్ల జారీలో రెవెన్యూ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేయాలన్నారు. కొందరు తహసీల్దార్లు ఉద్యోగం చేస్తున్న భార్యాభర్తలిద్దరికి పలు సర్టిఫికెట్లు మంజూరు చేయడం లేదన్నారు. దీంతో పిల్లల చదువులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నాయకులు రవికుమార్, రామకృష్ణ, మోహన్, బాబు తదితరులు ఉన్నారు.

సంక్షేమ వసతి గృహాలకు నూతన భవనాలు నిర్మించాలి

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో సంక్షేమ వసతి గృహాలకు నూతన భవనాలు నిర్మించాలని కోరుతూ లంబాడి స్టూడెంట్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ కిరణకుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు రాథోడ్ జీవన్ మాట్లాడుతూ.. శిథిలావస్థలో ఉన్న వసతి గృహాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భవనాలు కూలిపోయే స్థితిలో ఉన్నాయని ప్రభుత్వం స్పందించి నూతన భవనాలను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు జాదవ్, సాయికృష్ణ, నరేశ్, రాథోడ్ తదితరులు ఉన్నారు.


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

వేంకటేశ్వర ఆలయంలో పల్లకీ సేవ



జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండలో ఉన్న శ్రీ స్వయంభూ శిలాతీర్థ వేంకటేశ్వర ఆలయంలో శనివారం పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉషూ పోటీలు



నిజామాబాద్‌నాగారం: ఉషూ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో 24వ జూనియర్ జాతీయస్థాయి ఉషూ పోటీలు కొనసాగుతున్నాయి. పోటీల్లో పలు రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొంటున్నారు. శనివారం పలు విభాగాల విజేతలకు బంగారు, రజత, కాంస్య పతకాలు అందజేశారు. కార్యక్రమంలో మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, ప్రముఖ సినీ హీరో సుమన్, కాంగ్రెస్ లీడర్ సయ్యద్ కైసర్, ఉషూ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సోహెల్ అహ్మద్, అమెచ్యూర్ ఉషూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఖప్రేమ్ రాజ్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ అబ్దుల్ ఒమర్, షబ్బీర్, ముఖేష్ జీ, శంభు సేథ్, ఆరిఫ్, జవీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రానికి వచ్చిన తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను భీమ్ ఆర్మీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు అజయ్ మదాలే ఆధ్వర్యంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. రాష్ట్రంలో బెస్ట్ అవైలబెల్ స్కీమ్ విద్యార్థులకు దక్కడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రంజిత్, షేక్ మేరాజ్, హైమద్ లాలా, సాయినాథ్, విద్యాసాలంకే, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజాసేవే ఇందూరు యువత లక్ష్యం

నిజామాబాద్‌నాగారం: ప్రజా సేవే ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు అన్నారు. నగరంలోని కార్యాలయంలో శనివారం నిర్వహించిన నెలవారి సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఇందూరు యువత ఎల్లప్పుడు ముందు వరుసలో ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో బాలకిషన్, సుజాత సూర్యరాజ్, పట్టేవార్ శ్రీనివాస్, మద్ది గంగాధర్, ఎంపీ సుజాతరెడ్డి, ఐలేని సంతోష్ రెడ్డి, దర్శనం రాజు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సేవా సంస్థ ప్రతినిధి

పెండింగ్ బకాయిలను చెల్లించాలి



నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా రూ. 210 కోట్లకు పైగా పేరుకుపోయిన బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీం పెండింగ్ బకాయిలను రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. నగరంలో నీలం రామచంద్రయ్య భవన్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పేద ఎస్సీ విద్యార్థులు చదువుకునే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో గత మూడేళ్లుగా స్కీంకు సంబంధించిన నిధులు కేటాయించడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నిఖిల్, దేవిక, సాయికిరణ్, దుర్గాప్రసాద్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

జేవీవీని బలోపేతం చేద్దాం


మాట్లాడుతున్న న్యాయవాది బాస రాజేశ్వర్

నిజామాబాద్‌నాగారం: రాబోయే రోజుల్లో జన విజ్ఞాన వేదికను బలోపేతం చేద్దామని జిల్లా గౌరవ అధ్యక్షుడు, న్యాయవాది బాస రాజేశ్వర్ అన్నారు. ఆదివారం నగరంలోని లుంబిని బుద్ధ విహార్ ట్రస్ట్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో జేవీవీ నిర్మాణాన్ని మరింత పటిష్టవంతం చేసి, జిల్లా కేంద్రంతో పాటు మండలాల వారీగా సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో చెలిమెల పద్మ, చెలిమల రాజేశ్వర్, పులి జైపాల్, కె పండరి, తుక్కడి నారాయణ, సక్కి ఉదయ్ కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అవసరం మేరకే యూరియాను తీసుకెళ్లాలి

జక్రాన్‌పల్లి: రైతులు అవసరం మేరకే యూరియాను తీసుకెళ్లాలని మండల వ్యవసాయాధికారిణి దేవిక సూచించారు. శనివారం జక్రాన్‌పల్లి మండలంలోని సొసైటీలు, ప్రైవేటు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. మండలంలో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల కొరత లేదన్నారు. రైతులు యూరియాను పంటకాలం మొత్తానికి ఒకేసారి తీసుకెళ్లకూడదని తెలిపారు. ఈ-పాస్‌లో సూచించిన ఎకరాల మేరకే యూరియా బస్తాలు ఇవ్వాలని సూచించారు. పీఎం కిసాన్ రైతులు ఏఈవోల వద్ద ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.


ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏవో దేవిక

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వి ప్రభాకర్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీయూసీఐ నాయకులు

నిజామాబాద్ సిటీ: కార్మిక హక్కులను కాపాడుకునేందుకు కేంద్రం తీసుకొచ్చే నల్ల చట్టాలను నిరసిస్తూ ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కమ్యూనిస్టు నాయకులు కోరారు. శనివారం జిల్లాకేంద్రంలోని కోటగల్లి ఎన్‌ఆర్‌భవన్‌లో సమావేశం నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) జిల్లా శాఖ సమావేశంలో నాయకులు ఎస్‌కేఎం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ వి ప్రభాకర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందన్నారు. సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పెద్ది వెంకట్రాములు, దేవరాం, సాయిరెడ్డి, బొంబాయి గంగారాం, గంగాధర్, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. సార్వత్రిక సమ్మెకు మద్దతుగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శివ కుమార్, నూర్జహాన్, ఓమయ్య, నరేందర్, మల్లికార్జున్, రమేశ్‌బాబు, శంకర్ గౌడ్, పెద్ది వెంకట్రాములు, సందీప, స్వాతి, చక్రపాణి, హనుమల్లు, దేవేందర్, అనిల్, మురళి, లింగం, రాజేశ్వర్, రవి, కిరణ్, మోహన్, మల్లికార్జున్, శంకర్, అన్వర్, సాయిలు పాల్గొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టే సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు రమేశ్‌బాబు కోరారు. కార్యక్రమంలో కార్మికులు భూపతి, రేకులు నరసయ్య, సంతోష్, ఏక్ నాథ్, సదాశివ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ధర్పల్లి: మండల కేంద్రంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్లను టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్, భోజన్న, జగన్, సాయినాథ్, రాజేందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుళ్లకు పదోన్నతి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని తొమ్మిది మంది హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా పదోన్నతి లభించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులు వారం క్రితం వెలువడినట్లు పోలీసువర్గాల ద్వారా తెలిసింది. పదోన్నతి పొందిన వారిలో డీ జక్రయ్య, పరమేశ్వర్, రియాజుద్దీన్, ముంతాజ్ బేగం, అనురాధ, అరుణకుమారి, వసంత్‌రావు, జీవీ రమణేశ్వరి, సతీశ్‌కుమార్ ఉన్నారు.

క్రెడిట్‌కార్డు పేరుతో సైబర్ మోసం

ఖలీల్‌వాడి: నగరంలో ఓ వ్యక్తి నుంచి సైబర్ మోసగాళ్లు క్రెడిట్ కార్డు పేరిట రూ. రెండు లక్షలు కాజేసినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి శనివారం తెలిపారు. నగరంలోని మాలపల్లికి చెందిన బాధిత వ్యక్తికి ఇటీవల ఓ ప్రయివేట్ బ్యాంక్ క్రెడిట్ కార్డు వచ్చింది. ఈ కార్డును ఉపయోగించుకునేందుకు పిన్ నంబర్ కోసం ఆన్‌లైన్‌లో యత్నించగా, ఓ వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి బాధితుడికి ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని అందులో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. దీంతో బాధితుడు వివరాలు నమోదు చేయడంతో అతడి బ్యాంక్ నుంచి రూ.2లక్షలు కట్‌అయ్యాయి. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గత మూడేళ్ల నుంచి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు దీపిక, దినేశ్, ఆజాద్, అభి, గణేశ్, సతీశ్, నాయకులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,200	వెండి(కిలో)	1,11,500
22 క్యారెట్స్	90,650	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	28	60	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	60	90
బీరకాయ	50	80	దోసకాయ	20	40
దొండకాయ	30	60	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	100	150	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	40	60
వంకాయ	40	60	బీట్‌రూట్	30	60
పాలకూర	50	80	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	30	50
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	50	80
పుదీనా	60	90	గోరుచిక్కుడు	30	60
క్యాప్సికం	50	90			

-సుభాష్‌నగర్